## మినీ నవల



# తరాలు అంతరాలు

ప్రణవి

"సంతోష్‌బాబుకి యీ రోజుతో యిరవైఆరేళ్ళు నిండాయి మీ అందరూ వాడిని ఆశీర్వదించాలి!" శకుంతలమ్మ కళ్ళు చెమర్చాయి ప్లేట్‌లోని స్వీట్‌ని తీసుకొని, కరణం అన్నయ్య భార్య శ్రీదేవి నోటికందించింది

"కాబోయే అత్తగారివి! ముందు నువ్వే నీ అల్లుడిని ఆశీర్వదించాలి వదినా!"

శ్రీదేవి సంతోషంగా లేచింది. నోటినిండా స్వీట్ వుంది. "మా అమ్మాయీ, సంతోష్‌బాబూ దంపతులై, దొరబాబులాంటి పిల్లల్ని కని, కళకళలాడుతూ నూరేళ్ళు వర్ధిల్లాలి!" అని, కూతురు సీతాకుమారి తల నిమిరి, ముచ్చటగా మెటికలు విరిచింది.

దాదాపుగా అంతా యీ రకంగానే దీవించారు.

శకుంతలమ్మ సంతోష్‌బాబుకి లోగడ జాబు రాసింది. తప్పనిసరిగా పుట్టిన రోజు పండుగకి రమ్మంది కానీ యెందుకో సంతోష్ రాలేదు. అతని యిరవై ఆరేళ్ల జీవితంలో తల్లిమాట జవదాటడం యిదే ప్రథమం. 'వాడికేం యిబ్బందులొచ్చాయో? ఒకవేళ ఆఫీసులో సెలవు దొరకలేదేమో?' అనుకొని సర్దుకుంది. అయినా మనస్సుకు స్థిమితం కలగలేదు 'వాడే ఆఫీసరు. వాడికి సెలవు దొరకక పోవడమేమిటీ?'

"శకుంతలా! ఆలస్యమైపోయిందే! యేవో బయట రక రకాలపన్లు!" కరణం గారు రొప్పుకుంటూ వచ్చాడు.

"ఫర్వాలేదు, రా అన్నయ్యా! ఇలా కూర్చో!" పలహారాలప్లేటు అందించింది.

"ఓహోం బహుకమ్మగా వున్నాయి! యేంవేవ్! దేవీ! చూశావులే మా చెల్లెమ్మ వంటకాలు?" భార్యని కుదిపాడు. శ్రీదేవి మూతిముడుచుకుంది.

"అన్నట్టు, చెల్లెమ్మా! మనవాడు రాలేదుకదూ?"

"లేదన్నయ్యా!"

"వాడు పెద్ద ఆఫీసర్ కదులే! యెలా తీరుతుంది? ఆఫ్టరాల్ విలేజీ కరణాన్ని నేను. నాకే తీరదు! సరేలే! అసలు విషయానికొద్దాం! కలకత్తానించి మీరు యీ వూరికి వచ్చిన నాలుగేళ్ళు నుండీ సంతోష్‌బాబు పుట్టినరోజు పండుగను ఆనందంగా చేసుకుంటున్నాము. ఇలాగే సంతోష్‌బాబు యెక్కడున్నా నూరుపండుగలు చేసుకోని, తన పిల్లలకి పండుగలుచేసి సంతోషమైన జీవితం గడపాలని, మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను"అని, ప్లేటుని పక్కనుంచి తానే చప్పట్లు చరచ నారంభించాడు అది చూచి, మిగతా జనంకూడా చప్పట్లు చరిచారు

మొత్తానికి సంతోష్‌బాబు లేకుండానే, అతని పుట్టినరోజు పండుగ జయప్రదంగా జరిగింది

అంతా వెళ్ళిపోయారు శకుంతలమ్మ దేవునిగదిలో కెళ్ళింది ఆమె కెందుకో భయంగా వుంది సంతోష్‌ని కాపాడమని, యే ఆపదా రాకుండా చూడమని వేడుకుంది

ఆ రాత్రికి భోజనం సహించలేదు. అయినా బలవంతాన సంతోష్ పుట్టిన రోజు కనుక, అతని కిష్టమని చేసిన వంటకాలతో ఎంగిలిపడి లేచింది

కానీ, యెంతకూ నిద్రపట్టలేదు. సంతోష్ యెలా వున్నాడో? ఇంతవరకూ యెప్పుడూ తనమాట మీరలేదు. కానీ, ఇప్పుడెందుకు ఆగాడు. ఒకవేళ, తనను యెదిరించడుకదా? వాడికి భయ-భక్తులు చెప్పేవాళ్ళెవరున్నారు గనుక? తండ్రీ-తల్లీ తానై, గారంగా పెంచింది. తోడబుట్టిన అన్నయ్య, 'డాక్టర్ శ్రీకాంత్' వద్దకూడా వాడికి గారాబమే! తనని యెదిరిస్తే ఇంకేమైనావుందా? వాడికోసం ఎన్ని కష్టాలు పడింది? ఎన్ని అవమానాలకు గురైంది?

శకుంతలమ్మ మనసు పరిపరివిధాల ఆలోచించసాగింది. అలా-అలా ఆలోచనలు తన చిన్ననాటి రోజులకు సాగాయి.

బొమ్మలపెళ్ళి చెయ్యడం చాలా ఇష్టమైన ఆట తనకు. బడికి సెలవులిస్తే, రోజూ బొమ్మలపెళ్ళి చేసేది.

ఆరోజు బొమ్మలపెళ్ళి చాలా ఘనంగా చేయాలని, చాలా బొమ్మలు ప్రోగు

చిన్న పందిరికూడా వేసింది. తాను పెళ్ళికూతురుకి అమ్మ. మరో స్నేహితురాలు పెళ్ళికొడుకు తల్లి

ఇలా ఇరుపక్షాలుగా స్నేహితురాళ్ళు మారి, 'పెళ్ళి' చేశారు. సూత్రధారణ అయ్యాక, ఊరేగింపు ప్రారంభించారు కొంచెందూరం వెళ్ళాక, పల్లకీనుండి పెళ్ళికొడుకు కిందపడ్డాడు. పడగానే ఆ బొమ్మ ముక్కలైపోయింది మిగతా పిల్లలంతా "అయ్యో పెళ్ళికొడుకు చనిపోయాడే!" అని బాధపడ్డారు. కానీ, తానేమాత్రం చలించలేదు అప్పటికి తన వయస్సు యెనిమిది సంవత్సరాలే అయినా, మిగతా వారిలాబాధపడలేదు. "పోనీండే! పోతేపోయాడు. అంతకన్నా మంచివాణ్ణి తెచ్చి, పెళ్ళిచేద్దాం! తిప్పండి ఊరేగింపు!" అంటూ వూరేగింపుని మళ్ళించి, మళ్ళీ ఇంకో మంచి మగబొమ్మనితీసి, పెళ్ళికూతురు పక్కన కూర్చోబెట్టి తాళి కట్టించింది. భజంత్రీలు మంగళ వాద్యాలు వాయించారు

అంతలో ఇంట్లోనించి పెద్దగా ఏవో గావుకేకలు వినిపించాయి అంతా ఓక్షణం నిశితంగా విన్నారు సందేహంలేదు అది తప్పకుండా తన అమ్మగొంతే! ఎందుకో పెద్ద పెట్టున యేడుస్తూంది? ఆట విడిచి ఇంటివైపు పరుగుపెట్టింది. స్నేహితురాళ్ళుకూడా అనుసరించారు.

అమ్మ తల బాదుకొంటూ, ఏవో అంటూ, పిచ్చిగా ఏడుస్తుంది తనని చూడగానే గట్టిగా కౌగిలించుకొని, మరీ మరీ ఏడ్చింది అప్పుడే నాన్న, ఇంకెవరో వచ్చారు అంతా కన్నీళ్ళు పెట్టుకున్నారు ఇరుగు-పొరుగు వాళ్ళొచ్చారు అమ్మని నాన్నని ఓదార్చారు ఏవో సానుభూతి వాక్యాలు పలికి వెళ్ళారు.

దాని ఫలితం కొద్దిరోజుల్లోనే బయటపడింది. తనకు భర్తవియోగం సంభవించిందట! తన నొసట బొట్టు చెరిపారు. అన్నయ్య ప్రేమతో తెచ్చిన కలకత్తా గాజులు చిట్లకొట్టారు. ఇంకా, అనేక రకాల భూలోక నరకాన్ని చూపించారు.


ఎంత అన్యాయం? బొమ్మల పెళ్ళిళ్ళు చేసే తనకా యీ దురదృష్టం? నిజానికి తనకు పెళ్లెప్పుడు జరిగిందోకూడా తెలీదు తన భర్త ముఖం తనకు తెలీదు. కానీ, ఈతలాడుతూ, చెరువులో మునిగి చచ్చిపోయిన పేరిశాస్త్రివల్ల తనకీ అన్యాయం జరిగింది.

అప్పటినుండీ, తనను మిగతా పిల్లలతో కలిసి ఆడుకోనివ్వలేదు. ఇష్టమైన బట్టలుగానీ, నచ్చిన కూరలుగానీ వేసుకోనివ్వలేదు. తన తల్లిదండ్రులే తనని వంచించారు. అన్యాయంగా వైధవ్యం అంటగట్టారు. అలా కొన్ని సంవత్సరాలు యేడుస్తు గడిపింది.

తనతోటి స్నేహితురాళ్ళు ముచ్చటగా పెళ్ళిళ్ళు చేసుకొని, భర్తలవెంట కొత్త కాపురాలకు వెళ్ళిపోతూన్నారు. కానీ, తన విషయం యెవ్వరూ పట్టించుకోడంలేదు.

మద్రాసులో డాక్టర్ కోర్స్ పూర్తిచేసిన అన్నయ్య స్కాలర్‌షిప్‌తో

# పెద్దల నీడన ప్రత్యర్థుల కలయిక !



స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన పాత్ర వహించిన ముగ్గురు జాతీయ నాయకుల చిత్రపటం నీడన, స్వాతంత్ర్యానంతరం మారిన రాజకీయ పరిస్థితిలో ప్రత్యర్థులుగా మారిన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, మాజీ ఉపప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ కలుసుకొన్న సన్నివేశం. కీ॥ శే॥ పల్లభాయిపటేల్ 99 వ పుట్టిన రోజు సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటైన సభ సందర్భంగా తీసిన చిత్రమిది. ఫోటోలో పార్లమెంటు స్పీకర్ ధిల్లాన్ కూడా ఉన్నారు

---

అమెరికా పై చదువులకోసం వెళ్తానన్నాడు కానీ సముద్రాలు దాటి వెళ్ళడానికి వీల్లేదని మూర్ఖించి కూర్చున్నారు తల్లిదండ్రులు.

అదే సమయానికి, దూరపు బంధువైన ఒకాయన తన కూతుర్ని వెంటబెట్టుకొని, సారె గంపలతో వచ్చాడు ఆవిడ తనకు వదినట. తనకూ, తన అన్నకూ, బాల్యంలోనే పెళ్ళిచేశారట అన్నయ్య చదువు పూర్తి అయ్యిందని, కూతుర్ని కాపురానికి తీసుకొచ్చాడు.

కానీ, అన్నయ్య ఒప్పుకోలేదు. తాను అమెరికా వెళ్ళదలచానని, అందుకు ఇష్టమైతే, తనతో అమెరికాకు కాపురానికి పంపమని అడిగాడు పెద్దలంతా తర్జన

భర్జనలుపడి, చివరికి అన్నయ్య-వదినలను అమెరికాకు పంపారు

అన్నయ్య అనుకున్నది సాధించాడు అందుకు తనకు చాలా సంతోషమైంది! వారు వెళ్లేముందు, తనని మర్చిపోవద్దని ద్వంద్వంగా పలికింది.

మరో రెండేళ్ళు గడిచాయి స్నేహితురాళ్ళు ఒక్కొక్కరే తిరిగి పుట్టిళ్ళకు రావడం, పురుళ్ళు పోసుకొని, పండంటి పసిబిడ్డలతో తిరిగి వెళ్ళడం తనకెంతో ముచ్చట అనిపించింది. అంతేకాదు! గుండెల్లో ఏదో కోరిక! మనస్సులో ముద్దులొలికే మమత! నరాల్లో, 'అమ్మా' అనిపించుకొని, హాయిగా హృదయానికి చేతులతో హత్తుకోవాలనే తపన!

ఉండబట్టలేక ఓ రోజు తల్లినడిగింది, పెళ్ళిచేసుకుంటానని! ఆ మాటకు తన చెంప ఛెళ్ళుమంది. భూమి గిరగిరా తిరిగినట్లయింది కళ్ళుతిరిగి నేలకొరిగింది. కొంత సేపటికి ముఖాన నీరు చల్లారు. తెలివివచ్చి కళ్ళు తెరిచింది. ఎదురుగా రౌద్రమూర్తిలా నాన్న నిల్చున్నాడు.

"దురదృష్టవంతురాలివే నువ్వు! ఒకసారి తాడు తెగిందానివే! ఇక ఆ యోగం లేదు నీకు! మళ్ళీ ఇలాంటి వెర్రి-మొర్రి ఆలోచనలు పెట్టుకుంటే, యీ స్థానంకూడా కోల్పోతావు!" బరబరా లోపలికి వెళ్ళిపోయాడు.

ఆ రోజు కన్నీరు-మున్నీరుగా యేడ్చింది తాను. 'ఒకసారి తాడు తెగినద'ట తాను! యెంత మోసం! యెంత అన్యాయం! 'కట్నమిచ్చి పెళ్ళిచేయాలని యీ దొంగ నాటకం!' అనుకుంది.

యెంత కాదనుకున్నా తన కోరిక తనను విడిచిపెట్టడంలేదు యేం చేయాలి? తన తప్పేమిటి? మిగతావారిలా తాను పుట్టలేదా, పెరగలేదా? అందంలేదా, వయస్సులేదా? తనకెందుకీ శిక్ష? యేమైనాసరే! తానుకూడా తల్లికావాలి! 'అమ్మా' అనిపించుకోవాలి!

మరో సంవత్సరం గడిచింది తనకంటె చిన్నవారు కూడా పుట్టింటికొచ్చి, పురుడు పోసుకున్నారు. ప్రేమతో ఓ పసికందును చేతుల్లోకి తీసుకోబోయింది. వెంటనే ఆ పిల్ల తల్లి, తనను దూరంగా నెట్టింది. "నా బిడ్డని తాకకు!" ఆ మాటతో తన నవనాడులు క్రుంగినట్లయ్యింది. "అసలే నీ జాతకం మంచిదికాదు! నువ్వింటి కెళ్ళి వోమూల కూర్చోరాదు!" అని, ఆమె తల్లికూడా తనని మందలించింది.

వక్క పరుగున యింటికొచ్చి, యేడుస్తూ పడుకుంది. తల్లి భోజనానికి పిలిచినా వెళ్ళలేదు. ఆ బాధని మనస్సులో వుంచుకోలేక, తల్లితో చెప్పింది. ఆమె వోదార్చింది. వెంటనే తనకో 'బాబు' కావాలని అమ్మతో అంది.

ఆ విషయం తండ్రివరకూ వెళ్ళింది. ఆయన సాంప్రదాయకుడైన పిల్లవాడిని దత్తుచేయడానికి ప్రయత్నించసాగాడు. కానీ, అందుకు తానంగీకరించలేదు. 'ఎవరికో పుట్టిన బిడ్డని తానెందుకు ముట్టుకోవాలి? వీల్లేదు! అందరిలా తన గర్భంలో పెరిగిన బిడ్డనే కని, పెంచుకోవాలి! ఆ బిడ్డ తన రక్తంలో పాలుపంచుకోవాలి!'

అతనికి తానే అమ్మకావాలి! ఈ వుద్దేశ్యాన్ని ధైర్యంగా తల్లి-దండ్రులతో చెప్పింది.

తనకు కొవ్వెక్కిందని; కండకావరమని; మదపిచ్చని, ఇలా రక - రకాల పేర్లతో తిట్టారు. తల్లి-తండ్రి చీపురు, చాంతాడు, చెప్పులతో కొట్టారు. చివరికి పెరటిలోని వేపచెట్టుకి కట్టి, కర్రుకాల్చి కాళ్ళమీద వాతలు పెట్టారు. తీసుకెళ్ళి పిచ్చాసుపత్రిలో చేర్చాలని నిశ్చయించారు.

సరిగ్గా అదేసమయానికి దేవదూతల్లా అన్నయ్య-వదిన వచ్చారు, అమెరికా నుండి. తనకి బంధవిముక్తి కలిగించారు.

కానీ, అన్నయ్య-వదినకి భోజనం వేరు. వారు వేరేగదిలో, ఇస్తరాకుల్లో విడిగా భోజనం చేయాల్సొచ్చింది. వారు సాంప్రదాయాన్ని అతిక్రమించారని ఈ ఏర్పాటు.

ఒకరకంగా అది తనకు మంచి అవకాశాన్ని కలిగించింది. అన్నయ్య-వదినలతో మనసువిప్పి మాట్లాడింది. తనకు జరిగిన అన్యాయం, అవమానం, అన్నీ పూసగుచ్చి నట్లు చెప్పింది. మనిషిగా తనకున్న కనీస కోర్కెల్ని కూడా వివరించింది.

చదువు-సంస్కారం వాళ్ళను తనకు సన్నిహితులుగా చేసింది. వదిన జాలి పడింది. అన్నయ్య బాధపడ్డాడు. "ఇక్కడుంటే నిన్ను నిజంగానే పిచ్చాసు పత్రిలో చేర్చుతారు. మాతో తీసుకెళతాను. భయపడకు!" అన్నాడు అన్నయ్య.

అన్నయ్య తన నిర్ణయాన్ని చెప్పగానే, అమ్మా-నాన్న ఆనందంగా అంగీకరిం చారు. అన్నయ్యకు ఇదివరలో అడ్డంవచ్చిన ఆచారాలు, తన విషయంలో ఆటంక పరచలేదు కాబోలు! గుండెలమీదనుండి బరువు దింపినట్లు భావించి, సంతోషంగా వీడ్కోలిచ్చారు. కనీసం, ఓ జాబైనా వ్రాయమని తన నడగలేదు.

అంతా చికాగో వెళ్ళాము. అంతకుముందువరకూ కూపస్థమండూకంలావున్న తనకి, యీ విశాల ప్రపంచంలో అధునాతన పట్టణాలు, ప్రయాణాలు, మనుషులు మరీ వింతగా తోచింది. జీవితంమీద ఆశ పెరిగింది. తనకూ ఓ కొడుకుపుట్టి, గొప్ప వ్యక్తిగామారి, దేశ-దేశాంతరాలు విమానాలమీద, స్టీమర్లమీద, తిరుగుతూ, ప్రపంచంలో పురోగమిస్తూన్న వింతలను విజ్ఞానాన్ని పరిశీలిస్తూంటే తనకెంత తృప్తిగా వుంటుంది!

మరోసారి అన్నయ్యకి తన ఆంతర్యం గుర్తుచేసింది. అన్నయ్య-వదిన తీవ్రంగా ఆలోచించారు. "ప్రపంచంలో మన అమ్మ-నాన్నలకు తెలీని సాంఘిక మార్పులు ఎన్నో వున్నాయి సక్కూ! వాళ్ళ కెలా నచ్చచెప్పాలో నాకర్థంకావడంలేదు! మామూలుగా ఓ మనిషికి ఉండవలసిన సహజమైన కోర్కెను నువ్వు కోరుకున్నావు. దానిని యెలా కాదనను? నీ కోరిక తీరడానికి, నాకు నువ్వొక మాటివ్వాలి! .." అన్నయ్య అడిగాడు.

ఆ మాటకు తన దేహం పులకించిపోయింది. ఆనందం వుప్పొంగింది. 'అంటే...? అన్నయ్య తన కోర్కె నెరవేరే అవకాశం కల్పించబోతూన్నా డన్న మాట!...'

"నా ప్రాణమైనా అర్పిస్తానన్నయ్యా! నేను అమ్మనైతే చాలు!" తన కళ్ళనుండి ఆనందబాష్పాలు జల-జలా రాలాయి

"పిచ్చి సత్యా-" అన్నయ్య భుజాన తట్టాడు. "ప్రాణమివ్వక్కర్లేదు. అంతకంటే ముఖ్యమైనది, అంతకంటే కష్టమైనది నే నడిగేది! . ఆలోచించి, చెప్పు!"

"నా జన్మ ధన్యం కావడానికి యెంతకష్టమైనా పర్వాలేదన్నయ్యా!" తన చేతిని అన్నయ్య చేతనుంచి, వాగ్దానం చేసినట్లు గట్టిగా నొక్కింది.

శకుంతలమ్మ ఆలోచనలకి అంతరాయం కలిగింది. వంటింట్లో పిల్లి యేవో గిన్నెలు పడవేసింది.

లేచి వడి-వడిగా వెళ్ళి చూసింది. బాబుకోసం చేసిన వంటకాలని పడవేసి, పిల్లి తింటూంది. పిల్లిని తోలి, మళ్ళీ అన్నీ సర్ది, తన గదికి వచ్చింది, 'యెవ్వరకు ఎంత ప్రాప్తికల్గిన ..' అనుకుంటూ.

'యెన్ని కష్టాలు, యెన్ని అవమానాలు పడి, సంతోష్‌కి అమ్మనై పెంచానో. అలాంటివాడు, నేను రమ్మంటే రాకుండా యెందుకు ఆగాడు?' మళ్ళీ పడుకుంది!

రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. అందుకే తెల్లగా తెల్లవారేవరకు మెలకువ రాలేదు. పాలేరు తన పనులు తాను చేసుకుపోతున్నాడు.

అంతలో వాకిటముందు యేదో గుర్రపుబండి ఆగింది. అప్పటివరకు చలిమంట చుట్టూ కూర్చున్న పిల్లలులేచి, బండివద్దకొచ్చారు. కరణంగారి చిన్నకొడుకు గేటు తెరచుకొని, లోపలికి పరుగెత్తుకొచ్చాడు "అత్తా! సంతోష్ బావ వచ్చాడు." అని సంతోషంగా గంతులువేశాడు. ఆ మాటకు శకుంతలమ్మ మనసు సంబరపడి పోయింది.


'బాబు వచ్చాడా?' అనుకుంటూ, వడి-వడిగా సింహద్వారంవద్దకు వచ్చింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. 'సూట్‌లోవున్న సంతోష్‌బాబు పక్కన యెవరో ..??' నిశ్చేష్టంగా నిలబడిపోయింది.

మరో కొద్దిక్షణాలకు సంతోష్‌బాబు, అతనివెంట వచ్చిన అమ్మాయి వంగి శకుంతలమ్మ పాదాలు తాకారు. ఆమె తేరుకొని, నిశితంగా పరికించింది. పచ్చని పసిమిచ్ఛాయతో మెరిసిపోతూంది, ఆ అమ్మాయి నడుము. మెళ్ళో పసుపుతాడు కనిపించింది. శకుంతలమ్మ గుండె ఆగినంత పనైంది.

"నన్ను క్షమించమ్మా! .." సంతోష్ తడబడుతూ అన్నాడు.

ఆమె కనుకొలుకులనుండి రెండు వేడికన్నీటిబొట్లు రాలాయి. అచేతనంగా వారి శిరస్సుల మీదకు చేతులు జారాయి.

ఇద్దరూ లేచారు. ఈడుజోడుగా వున్నారు. తేనె కళ్ళు, కాస్తంత రాగి వర్ణంగా వున్న జుట్టు, కొనతేలిన ముక్కు, ఆరడుగుల పొడుగువున్న దొరబాబువంటి సంతోష్ పక్కన, అంతకు తీసిపోని అందం సంతరించుకున్నది ఆమె.




మౌనంగా లోపలికి నడిచింది శకుంతలమ్మ. ఆమెను అనుసరించారిద్దరూ.

గ్రామీణ ప్రాంతాల్లో వార్తా ప్రసారానికి రేడియోలు, టెలిఫోన్లక్కర్లేదు. క్షణాలమీద యీ వర్తమానం వూరంతా పాకిపోయింది ఇరుగు-పొరుగు అమ్మలక్కలు ముక్కున వేలేసుకుని, గుస-గుసలాడుకుంటూ వచ్చిపడ్డారు.

శకుంతలమ్మకు అయోమయంగా వుంది 'యెలా భరించడం యీ నిజం?' యాంత్రికంగా వారిని సింహద్వారంవద్దే ఆపి, పాలేరుని కేక వేసింది వాడితో వారికి దిష్టి తీయించింది తర్వాత, బయటికెళ్ళి తలుపులు వేసి, యెవ్వరినీ లోపలికి రాకుండా చూడమంది. పాలేరు తలుపులు వేసి, బయటికెళ్ళాడు.

"యేంది? యెక్కడికంట, యెగబడతన్నారు? యెల్లండెల్లండి! తరవాత సూద్దురుగాన్లే, పెళ్ళికూతుర్ని!" అడ్డంగా వచ్చాడు

అమ్మలక్కలు ముక్కున వేలేసుకున్నారు 'పెళ్ళికూతురే??'

"అవున్రా! యెవరా వచ్చింది?" వెంకాయమ్మ అడిగింది

"సంతోస్ బాబూ, పెల్లికూతురూ!" పాలేరు జవాబు.

"అవ్వ! యిదెక్కడ విడ్డూరవన్రా! యేవీ తెలీని నంగనాచిలా శకుంతల నాటకవాడింది, నిన్న! మన శ్రీదేవి కూతుర్ని చేసుకుంటానంది, కొడుక్కి! తెల్లారే సరికల్లా కోడల్ని తెచ్చుకుంది! . వురేయ్! సాంబయ్యా! నిజం చెప్పరా! నీకు తెలీదుట్రా యీ సంగతి?" వెంకాయమ్మ ఆరాతీసింది.

"బలేదానివే! నాకేం తెలుసుద్ది? ఆల్లు లవ్వాడుకున్నారుగావాలు, పెల్లిసేసుకొచ్చారు!"

"చూశావా, చూశావా? ఇద్రా అసలు సంగతి! . పాపం! ఆ సీతా కుమారి గతేంకావాలి? .. పోదాం పదండి! ఆ శ్రీదేవి యెంతేడుస్తుందో? సీతాలు వురిపోసుకుందేమో?"

వచ్చిన జనమంతా నోటికి వచ్చినట్లు అనుకుంటూ వెంకాయమ్మ వెంట శ్రీదేవి యింటికి సాగారు.

సంతోష్‌బాబు, పెళ్ళికూతురు లోపలికొచ్చారు శకుంతలమ్మ వసారాలో ఆగింది. పైకి యెగ్రబాకుతున్న సూర్యుడివంక దృష్టిసారించింది.

"నిన్నే నువ్వు వస్తావనుకున్నాను. నీకిష్టమైన పిండివంటలు చేశాను. కానీ నువ్వు రాకపోయినా, నీ పుట్టినరోజు పండుగను ఘనంగానే చేశాను బాబూ! యెంతమంది నిన్ను మనసారా దీవించారో! . కానీ, ఆ నోళ్ళే యివాళ ." దుఃఖం ఆగలేదు. మాట పూర్తి చేయలేక పోయింది.

"అమ్మా!...?" సంతోష్ దగ్గరగా వచ్చాడు.

"నేను భరించలేను బాబూ, భరించలేను నిన్నంతా . శపిస్తారు .. దూషిస్తారు .. నే వినలేను!" చేతులలో ముఖం దాచుకుంది

"ఊరుకోమ్మా నువ్వు! . యెవరు యెన్నన్నా నాకేం పర్వాలేదమ్మా! నా తల్లి దీవనలే నాకెనలేని వరం! నువ్వు బాధపడకమ్మా!" తల్లిని పాదవి పట్టుకొని వోదార్చాడు.

ఆమె కొన్ని క్షణాల్లో తమాయించుకుంది కొడుకుకి దూరంగా జరిగింది

"నాకు తెలీకుండా, నీకేమైనా ద్రోహంచేస్తే, నువ్వీఛాయలకు రాకుండా వుండాల్సింది. కానీ యిలా అవమానపర్చకూడదు!" గంభీరంగా అంది.

"అమ్మా ..!??" అదిరిపోయాడు సంతోష్.

"ఇది పల్లెటూరు! నన్ను తలెత్తుకోనివ్వరు సంతోష్! నీకెలా చెప్పను? . కనీసం . నీ మనసులో మాట నీ తల్లికి చెప్పలేవా? యే విషయంలో నిన్ను కాదన్నానని, నాకీ శిక్ష? భగవంతుడా! . యెందుకురా, నామీద యీ కక్ష? ." విసురుగా లోపలికెళ్ళి, మంచంమీద వాలిపోయింది, యేడుస్తూ.

పెళ్ళికూతురు అచేతనురాలైంది సంతోష వెంటనే అమ్మవద్దకు వెళ్ళాడు.

"నన్ను క్షమించమ్మా! నే తప్పు చేశానమ్మా!" ఆమె కాళ్ళు పట్టుకున్నాడు. "నువ్వింత బాధపడతావని తెలిస్తే నే పెళ్ళి చేసుకొనేవాడినే కాదమ్మా! నువ్వు నవ్వితే సంతోషం. బాధపడితే నాకు నరకంవేనమ్మా! నరకంవే!" సంతోష్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

చివ్వరి మాటలు ఆమె గుండెల్లో గుచ్చుకున్నాయి. చివాలున లేచి, సంతోష్ తలను చేతుల్లోకి తీసుకొని, గుండెలకు హత్తుకుంది. "వద్దు బాబూ! వద్దు! అలా అనొద్దు! నీ నూరేళ్ళ జీవితం నవ్వుల పంట పండాలి! . లే! అరె! అమ్మాయి

కూడా అలా నిల్చుంది! ఛఛ! యేవిటీవేళ, యిలా చిన్నపిల్లలా చేశాను?" లేచి, కొడుకు చెయ్యిపట్టుకొని, పెళ్ళికూతురి దగ్గరకు లాక్కొచ్చింది. "ఆ! ఇద్దరూ లోపలికి పదండి! నీళ్ళు రెడీ చేస్తాను. ముఖాలు కడుక్కొని, స్నానాలు చేద్దురు గాని!" గదిలోకి పంపి, పనిలోక దిగింది

"అమ్మాయ్ శ్రీదేవీ! చూశావుటే యీ మోసం? నిన్న మనముందు సీతాలుని తన కొడుక్కి చేసుకుంటాననదా? .. తెల్లారేసరికల్లా, వాడు దేన్నో వెంటేసుకొచ్చాడు! యెక్కడన్నా వుందా, యీ మోసం?. యీ నాటకం? ఈ బస్తీముండల్ని నమ్మకూడదే! అయ్యో సీతాలు! నీ బతుకు నవ్వులపాలైందే?" వెంకాయమ్మ శ్రీదేవిక చెప్పి, సీతాకుమారిని దగ్గరికి తీసుకుని, సానుభూతి చూపింది.

"చంటాడు చెబితే నేనేమిటో అనుకున్నా నక్కయ్యా! సంతోష్ నిజంగానే పెళ్ళిచేసుకొన్నాడా?" యింకా సందేహం తీరలేదు

"ఓసి నీ పిచ్చి మండిపోను! .. అందుకే నిన్ను యిలా ఆడించింది శకుంతల! వాడు 'లవ్వు' చేశాడటే 'లవ్వు!' మన యింటా, వంటా యెక్కడన్నా వుందా యిది?"

శ్రీదేవికి నిలువుగుడ్లు పడ్డాయి 'పదిమంది ముందూ నిన్న కోడలంది! ఈవాళ కాదంటే ?'

"అసలు మన సాంప్రదాయాన్ని చెరిచిందిగదుటే అది! వెనుకటికి దత్తు చేసుకుంటానంటే, నా కొడుకుని యిస్తానన్నా, దీనికేం మాయరోగం వచ్చిందో. వద్దని, అమెరికా పోయి దత్తుచేసుకొచ్చింది! అందుకే వాడంత లక్షణంగా పెళ్ళాడాడు నా కొడుకు చూడు! శివాలయంలో అర్చన చేసుకుంటూ యీ రోజుకీ నా మాటకోసం యెదురుచూస్తాడు ఇలాంటి దగుల్బాజీ వేషాలు వాడికేమన్నా వున్నాయా? యేం చేద్దాం! నీ ఖర్మ దాని ఖర్మ!"

"అక్కయ్యా! మీరంతా వుండండి! మనందరం వెళ్ళి, దాని నాటకా లేవిటో తేల్చుకుందాం! దొంగముండ! ఇంత నమ్మకద్రోహం చేస్తుందా! అరేయ్! చంటీ! మీ నాన్నగారెక్కడున్నారో, వెంటనే పిలవరా!' కొడుకుని పురమాయించింది వచ్చిన అమ్మలక్కలు యుద్ధానికి తయారుగా వున్నారు

దంపతు లిద్దరూ స్నానాలు ముగించారు. కాఫీ, ఫలహారాలు తీసుకున్నారు. అంతా అయ్యాక భార్యని గురించి వివరించబోయాడు సంతోష్.

"రూపా! రాత్రి నిద్రలేదుగా! .నువ్వెళ్ళి పండుకోరాదూ?"

రూప అర్ధవంతంగా నవ్వి గదిలోకి వెళ్ళింది.

"మా ఆఫీసులోనే స్టెనోగా పనిచేస్తూందమ్మా యీ రూప. ఈమెకు నాకు మధ్య ప్రేమ గొడవలేవీ లేవు. కానీ సానుభూతి! ..జాలి! ..యివేనమ్మా నన్ను తనకు జతచేసింది"

"అంటే .?" అర్ధంకాలేదు తల్లికి.

"రూపవాళ్ళు బీదవాళ్ళు. వాళ్ళనాన్న ఏదో కంపెనీలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. రూప స్కూల్ ఫైనల్ చదివేరోజుల్లో వోజమిందారుగారి అబ్బాయి ఆమెని ప్రేమించాడు. ఆ సంగతి వాళ్ళ నాన్నకు, వీళ్ళ నాన్నకు చెప్పాడుట రూపవాళ్ళ నాన్న భయపడ్డాడుట. వాళ్ళ నాన్న తిరస్కరించాడుట తనమాట వినకపోతే తన కొడుకువే కావన్నాడుట. కానీ అతను లెక్క చెయ్యకుండా యిల్లు విడిచి రూపని పెళ్ళాడటానికి వొచ్చాడుట. గుళ్ళో పెళ్ళిచేసుకొని, తిరిగి కారులో యింటికి వస్తూండగా, కారు యాక్సిడెంట్ అయ్యి, పెళ్ళికొడుకు, డ్రైవరు, రూప తండ్రి చనిపోయారుట! .."

"ఆఁ ..??...శ్రీరామచంద్రా! ."బాధగా నిట్టూర్చింది [illegible]తలమ్మ.

"తల్లీకూతుళ్ళు వకేసారి పసుపుకుంకుమలు కోల్పోయారు. తర్వాత బ్రతుకు తెరువుకోసం, రూప వుద్యోగంలో చేరింది అందాల బొమ్మవంటి రూప ముఖంలో వెలి, విచారం చూచి, నేనే వోరోజు అడిగి తెలుసుకున్నాను నా ప్రాణం విల విలలాడింది తల్లి విషయంకన్నా అన్యం పుణ్యంయెరుగని రూపకు తీరని అన్యాయం జరిగిందనిపించింది. 'మళ్ళీ పెళ్ళిచేసుకోరాదూ' అనడిగాను. రూప కన్నీరు పెట్టుకుంది. 'జీవితం చేజారిపోయిం'దంది.

"ఆ సాయంత్రం రూపవెంట వాళ్ళింటికెళ్ళి వాళ్ళమ్మతో మాట్లాడాను. తన కూతురు జీవితం చిగిర్చడంకన్నా తానేమీ కోరుకోనంది తన తల్లిని, చెల్లెల్ని వంటరిగా వదిలి తాను పెళ్ళాడలేనంది రూప.

"జీవితంలో మనిషిగా వో మంచిపని చెయ్యడానికి యిదొక మంచి అవకాశమనిపించింది. దీనికి తప్పకుండా నువ్వు హర్షిస్తావనే నమ్మకం నాకుంది. అందుకే అక్కడికక్కడే నా నిర్ణయాన్ని తెలిపాను రూపని నేను స్వీకరించి, కుటుంబాన్ని నిలబెడతానన్నాను. ఆ మాటకి వాళ్ళంతా ఆనందించారు.

"అంతలో వాళ్ళకి తెలిసిన వో పెద్దమనిషి రావడం, జరిగిందంతా వినడం జరిగింది. వెంటనే పంచాంగం తిరగవేసి 'రేపు మంచి లగ్నం వుంది. ఇలాంటిది పుష్కరానికి వక్కసారి వస్తుంది కనుక రేపే చేసేద్దాం!' అన్నాడు. 'అమ్మకు తెలీకపోయినా సమయానికి ఆమె లేకపోయినా యిదొక దివ్యమైన కార్యంకనుక ఆమె మిమ్మల్ని క్షమిస్తుంది. మీరు రేపు పెళ్ళికాగానే బయల్దేరి మీఅమ్మ ఆశీర్వాదాలు పొందండి' అన్నాడు.

"ఇలా నీకు తెలుపకుండా, నీ అనుమతి పొందకుండా క్లుప్తంగా గుళ్ళో పెళ్ళి చేసుకొచ్చానమ్మా!"

సంతోష్ ముఖమంతా చెమటలు పట్టాయి తల్లిముఖం గంభీరంగా మారింది. సంతోష్ తన గుండెలమీది భారాన్ని దించినట్లు అనుభూతి పొందాడు. తల్లిదృష్టి యెక్కడో వుంది. యేదో తెలీనిబరువు నెత్తి కెక్కినట్లయింది



కుర్చీనుండి లేచింది. "సంతోష్ యిలా రా!" రూప పడుకొన్న గదికేసి సాగింది. సంతోష్ ఆమెను అనుసరించాడు.

శకుంతల పూజగదిలోని కుంకుమబరిణె తెచ్చి సంతోష్ కిచ్చింది.

"అమ్మా! రూపా!" వస్తూనే పిలిచింది మంచమీద పండుకున్న రూప చివాలున లేచి నిలబడింది.

"నువ్వదృష్టవంతురాలివమ్మా! ఇదే యే ముప్పై, నలభైయేళ్ళ క్రితం గనుక అయినట్టుంటే, నువ్వు దురదృష్టవంతురాలి వయ్యేదానివి నా బాబు నీకు జీవితాన్నిచ్చాడు. నా గుండెల్లోని కోరిక, నా నరనరాల్లోని వాంఛ, నా మనో ఆశయం నెరవేర్చాడమ్మా!" ఆప్యాయంగా రూపని దగ్గరికి తీసుకొని తల నిమిరింది.

"బాబూ! యేది, యీ చిట్టితల్లి నొసట బొట్టు దిద్దోసారి!"

సంతోష్ కుంకుమబొట్టును రూపనొసట దిద్దాడు.

"ఈక్షణం నా ఆశయం ఫలించి, నా బాబువల్ల నాజన్మ ధన్యమైంది!" తన్మ

యత్వంలో కళ్ళు మూసుకుంది ఆమె కనురెప్పలనుండి సజలబిందువులు రాలాయి రూప శిరస్సుమీద.

తర్వాత కొడుకుని కోడలిని రెండుచేతులతో దగ్గరకు తీసుకొని, హృదయానికి హత్తుకుంది. "మీ యిద్దరూ నాకు రెండుకళ్ళు! ఈయింట మీరు, మీకు పుట్టబోయేవారు వేయాలి ప్రేమపందిళ్ళు!"

శకుంతలమ్మ వాత్సల్యాభిమానాలకు చకితురాలైంది రూప.

"బాబూ! రేపు యీ వూరు వారందరికీ భోజనాలేర్పాటుచేద్దాం. నీ గొప్పతనాన్ని మనిషి మనిషికీ చాటుతాను! మనిషంటే యెలా వుండాలో నేర్చుకోమంటాను! .." శకుంతలమ్మ పరవసించి అనేస్తుంది

"అమ్మా!...ప్లీజ్! ..నా దొక్క రిక్వెస్ట్! నువ్వేన్నయినా చెప్పు! కానీ, గొప్పతనం మాత్రం మనం చెప్పుకోకూడదు!" సంతోష్ అన్నాడు.

"అదేవిటి బాబూ! .?"

"అవునమ్మా! .ఇది మనలోనే వుండడం శ్రేయస్కరం ..!"

శకుంతలమ్మ విస్మయంగా చూచింది. "బాబేనా యీ మాటంది? మంచిపనిని పదిమందికీ చెప్పవద్దా? ..అంటే ? సంఘానికి భయపడుతున్నాడా?"

అంతలో కరణం అన్నయ్య తలుపుతట్టాడు

"సరే! మీరు విశ్రాంతి తీసుకోండి! భోజనాలయ్యాక, నే లేపుతాలే!" తలుపు దగ్గరగావేసి హాల్లోకొచ్చి బయటితలుపు తెరిచింది.

"యేమిటే శకుంతలా! అబ్బాయి వచ్చాడుటగా?"

"లోపలికి రా అన్నయ్యా!. "

"రావడం కాదుగానీ, అసలుసంగతి చెప్పు! . నే విన్నది నిజమేనా?"

శకుంతల వో క్షణం ఆలోచించింది. కరణంగారిని గురించి తనకు బాగా తెలుసు. వకటికి నాలుగు అల్లుతాడు. "కాదు! నువ్వు విన్నది అబద్ధం!" అతనివంక సూటిగా చూచింది

"అయితే వా డెవ్వర్నీ లేవదీసుకు రాలేదంటావు?" కరణంగారన్నాడు.

"అన్నయ్యా! యేవిటా మాటలు? .."

"మరేవిటమ్మా! గుర్రపు బండిలోంచి, చేతులుపట్టుకొని దింపలా! వూరు నిద్రపోతూందనుకున్నావా? నిన్న నువ్వన్నమాట లేవిటి? ఈ రోజు వీడుచేసిన పనేవిటి? . అసలేడి వీడు? వీడి సంగతేవిటో తేల్చేస్తా! ." లోపలికి రాబోయాడు.

"ఆగు! తేల్చాల్సిన అవసరం నీకేంలేదు. వాడికి నీ కూతురు నచ్చలేదేమో! నచ్చినదాన్ని చేసుకొచ్చాడు. అందుకు నే నొప్పుకున్నాను!"

కరణంగారు ఆగిపోయాడు కోపం, ద్వేషం రగుల్కొన్నాయి.

"ఇదేం వూరనుకున్నావా? వల్లకాడనుకున్నావా? చేతికందినదాన్నల్లా తెచ్చి భోగంవేషా లేయిస్తావా?"

"అన్నయ్యా! " బిగ్గరగా అరిచింది. ఆ అరుపుకి సంతోష్ లేచి, తల్లి వద్దకు పరుగెత్తుకొచ్చాడు. "జాగ్రత్తగా మాట్లాడు. ఇంకోసారి మాటతూలితే నీ మర్యాద దక్కదు "

"హుం మర్యాద! ... నీలాంటి వంచకురాళ్ళకి మాట-మర్యాదకూడా!" ఛీత్కరించి, బరబరా వెళ్ళిపోయాడు.

దారిలో అతనిభార్య శ్రీదేవి సపరివారంగా యెదురైంది. భర్తనుచూచి బావురుమంది.

"యెందుకే మీరంతా ఆ భోగంకొంపకి? పదండి...పదండి! దేవుడు మనకి మేలేచేశాడు. పొరపాటున మన అమ్మాయిని ఆ దగుల్బాజీ వెధవకి యివ్వాలనుకున్నాంగానీ, యిస్తే యింకేమైనా వుందా? వర్ణసంకరం అయ్యేదే! వెయ్యిగుళ్ళు కట్టించినా తీరనిపాపం!" కరణంగారు తెలివితేటలు చూపాడు.

"అదేవిటబ్బాయ్! అలా అన్నావు? ..వర్ణసంకర వేఁవిటి?" వెంకాయమ్మ అందుకుంది.

"కాకపోతే యేవిటి వదినా? ఆ సంతోష్‌గాడేవైనా సాంప్రదాయకుడనుకున్నావా? అమెరికావాడు కాదూ? ఇన్నాళ్ళనుండీ మనం ఆలోచించలేదుగానీ వాడు కిరస్తానపువాడు. దత్తు చేసుకున్నంత మాత్రాన బ్రాహ్మడవుతాడా? రండి రండి! పోదాం!"

"కాదబ్బాయ్! ఇంతటి వర్ణసంకరానికి యెలా వడిగట్టింది ఆ దుర్మార్గురాలు? నువ్వు పద! అదేదో మేము తేల్చుకొస్తాము, పదంర్రా!" వెంకాయమ్మ ముందుకు దారితీసింది. ఆవిడ వెనుక మిగతాజనం.

"యెందుకమ్మా అలా అన్నావు? యేం జరిగింది?" సంతోష్ అడిగాడు.

"యేవీలేదు. తనకూతుర్ని నీకివ్వాలనుకున్నారు. నేనుకూడా సరే అన్నాను. అందుకు యీ రాద్ధాంతం! మనంవీ పల్లెటూరికి రాకుండా కలకత్తానించి, తిన్నగా పాండిచేరికి మీ మామయ్యవెంట వెళ్ళినా బావుండేది!"

"అమ్మా! అదేవిటి ఆడపటాలం వస్తుంది?" గేటునుండి ముందుకు వస్తున్న మూకను చూచాడు. శకుంతలమ్మ గుండె దడదడలాడింది.

"హుం గోరంతలు కొండతలు చేయడంకన్నా యీ పల్లెటూరి జనానికి పనేముంది! ..నువ్వు లోపలికెళ్ళు!" అంటూ సంతోష్‌ని పంపింది. కానీ సంతోష్‌కి భయంవేసింది. 'అమ్మ లోగడ మాటిచ్చిందన్నమాట! ఫీ! తన తొందరపాటువల్ల యెంత చిక్కొచ్చిపడింది!' అనుకొని, యెందుకైనా మంచిదని, తల్లికి దగ్గర్లోనే రక్షణకోసం నిలబడ్డాడు.

"యేవమ్మా వదినమ్మా!" వెంకాయమ్మ వస్తూనే ప్రారంభించింది. "యేదో నిన్న సీతాలు నీ కోడలన్నావు! తెల్లారే సరికల్లా యేవిటీలా నట్టేట్లో ముంచావు?"

"... .?" శకుంతల మాట్లాడలేకపోయింది.

"అమ్మ ననాల్సిన పని లేదు" సంతోష్ ముందుకొచ్చాడు.

"నాకు నచ్చిన పిల్లని నేను చేసుకున్నాను."

"ఓహో! ఏది బాబూ ఆ నచ్చిన పిల్ల? మేం చూడొచ్చా?" ఒకామె అంది.

"ఓ! బాగా చూడండి!" విసురుగా లోపలికెళ్ళి, రూప చెయ్యి పట్టుకొని అందరి ముందుకు లాక్కొచ్చాడు. "ఇదిగో నా పెళ్ళాం!"

రూపని చూచి, అంతా ఆమె అందానికి ఆశ్చర్యపోయారు.

"ఈ మాత్రానికేనా అంత పొగరు! నా కూతురుకంటే యేవందంగా వుందిది?" శ్రీదేవి వుక్రోషం చూపింది.

"అత్తా! ఉక్రోషంతో అన్నా, మొత్తానికి నిజం చెప్పావు కాకిపిల్ల కాక్కిగా ముద్దు!" సంతోష్ అన్నాడు.

"ఆ! ఓరి వీడి నోరుబడిపోను! చూశావాక్కయ్యా యెంతమాటన్నాడో? నా బిడ్డ కాకిపిల్లా? వీడికళ్ళు పొడవ! వీడు నాశనం ." శ్రీదేవి శోకాలుతీస్తూ శాపనార్థాలు ప్రారంభించింది

"వదినా! . "శకుంతలమ్మ ఆ మాటలు వినలేక బిగ్గరగా అరిచింది. "అంతటితో ఆపు!"

"పెళ్ళికూతురా! నీకూ అమ్మా-నాన్నా లేరా?" వెంకాయమ్మ అడిగింది. ఈ వాతావరణం చూచేసరికి రూపకి తేళ్ళు పాకినట్లయింది. ఛీత్కారపు చూపు విసిరి, మూతి ముడుచుకొని, లోపలికిపోయింది.


"అదీ సంగతి!ఆమాంబాపతు సరుకు గనుకే 'టింగురంగా' అంటూ లేచొచ్చేసింది!"

"ఆపు! నోటికొచ్చినట్లు కూశావంటే, మర్యాద దక్కదు!" శకుంతలమ్మ ఆడపులిలా గాండ్రించింది "పొండి అవతలికి! యెవరు పిలిచారే మిమ్మల్ని? పిలవని పేరంటానికొస్తారటే? సిగ్గులేపోతేసరి! పరగడుపున-పొరుగిళ్ళకు బయల్దేరారు!"

"సిగ్గెవరికిలేదో తెలుస్తూనేవుందే?" శ్రీదేవి అందుకుంది. "గంతకుతగ్గ బొంతను తెచ్చుకున్నావుగా! పుట్టు-పూర్వోత్తరాలు లేనివాడికి పట్టపురాణియే తలమాసిన వాడిస్తాడే? పూర్వీకుల సాంప్రదాయాలుచూసి, మేము మోసపోయినా, పైన దేవుడనేవా డొకడున్నాడే! వాడే కాపాడాడే మమ్మల్ని!" ఆకసంవంక చూచి దణ్ణాలు పెట్టింది.

"నిజవేనేవ్! ఈ దత్తపుత్రుడు 'కిరస్తాన'పు వాడు కదూ? అవ్వ! ఇంకేమైనా వుందా? వర్ణసంకరం .." వెంకాయమ్మ నోరు కొట్టుకుంది.

"ఏంకూశావే? నా కొడుకు 'కిరస్తాన'పు వాడా?" శకుంతలమ్మకు ఆవేశం




పేట్రేగిపోయింది. టీపాయ్‌మీదున్న గ్లాసు తీసుకొని, వెంకాయమ్మకేసి విసిరింది. చాతుర్యంగా వెంకాయమ్మ ఆ దెబ్బ తప్పుకుంది. మిగతా జనం భయపడి వెనక్కు తిరిగారు వెంకాయమ్మ, శ్రీదేవిమాత్రం ఇంకా పగ సాధించాలని వున్నారు.

“ఎంత వగలాడివే మాయదారిదానా! ఎంత పల్లెటూళ్ళోవున్నా, మా కా మాత్రం తెలీదుటే? అమెరికాలో మనలా బ్రాహ్మణ సాంప్రదీయకు లెందుకుంటారే! వాళ్ళంతా కిరస్తానపువాళ్ళు కాదుటే? దత్తు చేసుకున్నంత మాత్రాన ‘కిరస్తాన’పు వాడు బ్రాహ్మడవుతాడా?” శ్రీదేవి అంది

అవి వినలేక చెవులు గట్టిగా మూసుకుంది శకుంతల

“ముక్కుపచ్చలారని మొగుడి మొగమైనా చూడకుండా, వల్లకాట్లో పెట్టిన ముదనష్టపుదానవు కదుటే నువ్వు! నీకు మంచి బుద్ధులెలా వస్తాయి? వస్తే నా కొడుకునే దత్తు చేసుకొనే దానివే! ఆ కిరస్తానపు వాడిని కులంలో కలిపేదానివే కాదు!” వెంకాయమ్మ మెటికలు విరిసిపోసింది

“కాదు! కాదు! నా బాబు ‘కిరస్తానీ’ కాదు! నా బాబు ‘కిరస్తానీ’ కాదు! దొంగముండల్లారా! పొండి!” ఏడుస్తూ కాలిచెప్పులను తెచ్చి, ఇద్దరి మీదికీ విసిరింది. ఆ చెప్పుదెబ్బలు తిని, ఇద్దరూ, నోటికొచ్చిన కూతలు కూస్తూ పారిపోయారు.

“ఈడియట్స్!” వెళ్ళి తలుపులు వేసి వచ్చాడు సంతోష్. ఇంకా తల్లి గోడకు తల ఆనించి, ఏడుస్తూనేవుంది.

“నువ్వూరుకోమ్మా! ఆ ఫూల్స్ అన్నారని నువ్వెందుకు ఆవేశపడతావు? నేను ‘క్రిస్టియన్’ని అయితేమాత్రమేం? శాస్త్రయుక్తంగా దత్తు చేసుకున్నావ్!

సాంప్రదాయసిద్ధంగా పెంచావు. ఇంతకంటే ఇంకేంకావాలి, ఏ కులస్థుడికైనా ఏ మతస్థుడికైనా? నువ్వు బాధపడకు!'' తల్లిని వోదార్చాడు.

''కాదు బాబూ! కాదు! నువ్వు నా బిడ్డవేరా! నా స్వంతకొడుకువిరా! నా గర్భంలో పుట్టి, నా రక్తం పంచుకున్న నా బంగారుకలవిరా! నువ్వు దత్తపుత్రుడివి కాదురా!'' ఉండబట్టలేక తన గుండెల్లోని మాటను బయటికి ఏడుస్తూ అనేసింది.

''అమ్మా! ?'' విస్మయంగా అరిచాడు సంతోష్. రూప పరిగెత్తుకొచ్చింది.

''అవును బాబూ! అవును నేను నీకు స్వయాన అమ్మని! నా మాట నమ్ము!'' యేదో తెలియని వుద్వేగం వుత్పన్నమైంది. అమాంతం కొడుకుని, గట్టిగా కౌగిలించుకుంది.

''అమ్మా! నువ్వేమంటున్నావో నీకు తెలుస్తూందా? ..'' తల్లికి దూరంగా జరిగాడు. భయంగా తల్లి ముఖంలోకి చూచాడు.

''నిజం బాబూ! నిజంగా నువ్వు నా కొడుకువిరా! యేళ్ళ తరబడి గుండెల్లో దాచిన యీ నిజాన్ని యివాళ నీతో చెబుతున్నాను! .. మళ్ళీ నన్ను 'అమ్మా' అని పిలు, బాబూ!'' అంటూ, మళ్ళీ సంతోష్‌ని కౌగిలించుకోబోయింది.

''ఆగు!...'' దూరంగా జరిగాడు

ఆ శబ్దానికి శకుంతలమ్మ కంపించిపోయింది.

సంతోష్ చెవుల్లో వెంకాయమ్మ మాటలు గింగురుమన్నాయి. 'ముక్కుపచ్చలారని మొగుడిమొగమైనా చూడకుండా, వల్లకాట్లో పెట్టిన .' గట్టిగా చెవులు మూసుకున్నాడు. ''వద్దు! నే వినలేను! నే వినలేను!'' బయటికి అనేశాడు.

''బాబూ! .. అలా అనకు! .. నేను అమ్మన్రా! .. నీ కన్న తల్లిన్రా!'' చేతులలో ముఖం దాచుకుంది.

సంతోష్ వో క్షణం మౌనంగా వున్నాడు. ''మనం సంఘజీవులమని, మన చుట్టూ వో సంఘం వుందనీ గుర్తుంచుకొని చెప్పు!''

''హుం!... యీ నాటికి నువ్వు పెద్దవాడివయ్యావు!'' శకుంతలమ్మ తీవ్రంగా చూచింది కొడుకువంక ''ఆచారాల పేరుతో ఆడవారి జీవితాలను చితికి చేర్చేదిరా యీ సంఘం! అబలల జీవితాలలో ఆరని నిప్పులు రగిల్చేదిరా 'యీ సంఘం! .. ఇలాంటి దుష్టసంఘాన్ని నేను లెక్కచెయ్యను. దాని వునికి నా కక్కర్లేదు!... ఎవరు యెన్నన్నా సరే! నువ్వు నా కొడుకువనేది నిజం!'' ఆవేశంలో ఆమె ముక్కుపుటాలు యెగురుతున్నాయి. కళ్ళు యెర్రబారి వున్నాయి.

సంతోష్ కూడా ఆవేశపడ్డాడు. తాను తల్లితో మాట్లాడుతున్న విషయం మరిచిపోయాడు. ''నా చుట్టూ వున్న సంఘంలోని వక వ్యక్తిగా అడుగుతున్నా! నువ్వన్నదే నిజం అయితే, నీ కొడుక్కి నిజమైన తండ్రెవరు?...''

"సంతోష్ ..???" భూమి దద్దరిల్లింది.

"నాకు నిజంకావాలి!" రెట్టించాడు

"లేరు! .. నీకు తల్లీ-తండ్రీ అన్నీ నేనే! నువ్వు అమ్మ కొడుకువిరా! బాబూ! యీ 'అమ్మ' కొడుకువి." మళ్ళీ దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది

"అమ్మకొడుకు పసివాడేంకాదు, కాకమ్మ కథలు వినడానికి! నిజం చెప్పు!"

"అయ్యో! నా మాట నమ్ము బాబూ! నీకు నాన్న లేరు! . అంతకంటే ఇంకేమీ అడగకురా! . నే చెప్పలేను నే చెప్పలేను!" . నిలువలేక లోపలికివెళ్ళి బెడ్ మీద పడిపోయింది సంతోష్ అంతటితో ఆగలేదు ఆమె వెంట వెళ్ళాడు

"నువ్వు చెప్పకపోయినా, నా కర్థమైంది, భర్త ముఖం చూడకుండానే తాళి తెగిపోయిన ఆడపిల్లలు, కాలుజారితే కలిగే పిల్లలకి యేమని చెప్పు " మాట పూర్తి అవ్వకముందే సంతోష్ చెంపలు వరుస-వరుసనే చెళ్-చెళ్ మన్నాయి. కళ్ళు బైర్లుకమ్మాయి

"దుర్మార్గుడా! .. ఇదట్రా నువ్వు తెలుసుకుంది? .. ఇందుకేనట్రా నిన్ను పెద్ద చదువులు చదివించింది? . యే కొడుకురా, తన తల్లినిలా అడుగుతాడు? దేవుడా! . యింకా నన్ను బ్రతికించే వుంచావా? నా గుండెలు పగులకొట్టి, నన్ను తీసుకెళ్ళిపో ప్రభూ! .. ఈ నీచుడి ముఖం నే చూడలేను! .. పో! ముందు! .. నీ ముఖం చూపకు!" మళ్ళీ వీపుమీద బాదుతూ బయటికినెట్టి, తలుపులు వేసుకొని, భోరున యేడ్చింది

మనస్సు చెదిరిన సంతోష్ కూడా అక్కడ నిలవలేకపోయాడు రూప అడ్డు వచ్చినప్పటికీ లెక్క చెయ్యకుండా, విసురుగా బయటికెళ్ళిపోయాడు రూప అచేతనంగా చూస్తూ వుండిపోయింది

కొంత సేపటికి తలుపులు తీసింది శకుంతలమ్మ వో సూట్ కేసుతో బయటికొచ్చింది పాలేరు సాంబయ్యని కేకవేసి యెడ్లబండిని సిద్ధం చెయ్యమంది

"రూపా! నేనెన్నో కలలుకని, ఆశలు పెంచుకొని, కన్న కొడుకుని యీ రోజు కాదనుకుంటున్నాను నేను లేకపోయినా, వాడిని కాపాడుకొనే బాధ్యత, నువ్వు తీసుకున్నావు. అలాగే, యీ యింటి బాధ్యత కూడా తీసుకోమ్మా! నేనిక లేనని చెప్పు!" తాళపు చెవులగుత్తి అందించి, చీర కొంగును నోటికడ్డం పెట్టుకుంది

"అత్తయ్యా! అలానకండత్తయ్యా! మమ్మల్ని విడిచి వెళ్ళొద్దత్తయ్యా!" రూపకు దుఃఖం ఆగలేదు.

"వద్దమ్మా! వద్దు! యే కొడుకూ అనలేని మాట, నా కొడుకు అన్నాడు, అప్పుడే నేను చచ్చిపోయాను! .. అప్పుడే నేను చచ్చా .." వడి-వడిగా సూట్ కేస్ తో బయటికి సాగింది. సాంబయ్య, చేతిలోని సూట్ కేస్ అందుకొని బండిలో

పెట్టాడు. శకుంతలమ్మ యెక్కగానే, బండి బస్తీకేసి సాగింది. నిస్సహాయంగా చూస్తూ నిల్చుండిపోయింది, రూప.

ఊరి కాల్వగట్టుమీదున్న సరివితోపులో వంటరిగా కూర్చున్నాడు సంతోష్ చాలాసేపు. చివ్వరికో నిర్ణయానికొచ్చి, తిన్నగా యింటికొచ్చాడు తనకోసం యెదురుచూస్తూన్న రూప యెదురైంది.

"అత్తయ్య సూట్ కేస్ తీసుకొని వెళ్ళిపోయారండి, యెక్కడికో? వెంటనే వెళ్ళి పిలుచుకురండి!" ఆందోళనగా అంది.

"వెళ్ళిపోయిందా?" బరువుగా నిట్టూర్చాడు. "వెళ్ళనియ్యి! పాండిచ్చేరి మామయ్యగారింటికి వెళ్ళివుంటుంది! ఐయామ్ వెరీ సారీ రూపా! ఈ విషయాలేవీ నాకు తెలీదు!"

"మీ ప్రవర్తన నాకేం బాలేదండి! దేవతవంటి అత్తయ్యని అలా విడిచి పెట్టడం న్యాయంకాదు. ప్లీజ్! వెళ్ళి, తీసుకురండి!" భర్త చేతులు పట్టుకుంది.

"రూపా! నన్ను విసిగించకు! ఐయామ్ నాటె ఫూల్! కమాన్! రెడీకా! మనంకూడా వెంటనే వెళ్ళిపోదాం! ఈ ఇంట్లో నాకు స్థానంలేదు! క్విక్!" లోపలి కెళ్ళి తమ సామాన్లు బయటవేశాడు

"ఎవర్నయినా అడిగి యెడ్లబండి ఏర్పాటుచేసుకొస్తాను" వాకిట్లోకివచ్చాడు.

అదే సమయానికి ఓ జట్కాబండి వచ్చి, యెదురుగా ఆగింది. డాక్టర్ శ్రీకాంత్ బండి దిగాడు.

జట్కా-వాలాకి డబ్బులిచ్చి, సూట్ కేస్ చేతబట్టుకొని, వెనక్కు తిరిగాడు.

"అరె! సంతోష్?? ..వెన్ డిడ్ యు కం బాయ్?" విస్మయంగా అడిగాడు "ఇదేవిటి? ఇలా వున్నావు? ..ఒంట్లో బాలేదా?" సంతోష్ భుజంమీద చెయ్యివేసి లోపలికి నడిపించాడు

"నో! ..నథింగ్!.. నాకేంలేదు. ఒన్ మినిట్ అంకుల్! .ఇప్పుడే వస్తా" అని, వెంటనే వెనక్కువచ్చాడు. తిరిగి వెళ్ళబోతూన్న జట్కావాలాని పిలిచి, పది నిముషాలు వుండమని, తాము బస్తీకి వస్తామని చెప్పాడు. తనకోసం ఆగిన మేన మామవద్దకొచ్చాడు.

"ఎందుకు బండిని ఆపావు?" ముందుకు సాగారు.

"ఇప్పుడు బయలుదేరాలనుకుంటున్నాము!"

"ఇటీజ్ ఆల్ రైట్! అసలెప్పుడొచ్చావో చెప్పనేలేదే?"

"ఈరోజు పొద్దున్నే వచ్చాం!"

"వచ్చాం అంటున్నావు. ఎవరెవరు?"

"రండి చెబుతా!" లోపలికి ముందుగా వెళ్ళాడు. వెనుక శ్రీకాంత్ వచ్చాడు. సంతోష్ ముభావంగా వున్నట్లు అనిపించింది. 'చేతిలోని సూట్ కేసుని అందుకొనే వాడే! ఎందుకో అడగలేదు; అనుకుంటూ హాల్లోని టీపాయ్‌మీద సూట్ కేస్ పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

మరుక్షణంలో సంతోష్ భార్యని పిలుచుకొచ్చాడు "అంకుల్! నిన్న నాకు మద్రాస్‌లో పెళ్ళి జరిగింది ఈమె నా భార్య 'రూప!' రూపా! మా మేనమామ గారు డాక్టర్ శ్రీకాంత్! నేను కలకత్తాలో వీరింట్లోనే పెరిగాను" పరస్పర పరిచయం చేశాడు. రూప చేతులు జోడించి, నమస్కరించింది.

సంతోష్ మాటలకు స్తబ్దుడయ్యాడు శ్రీకాంత్ రూప నమస్కారాన్ని కూడా గమనించలేదు ఆమె తిరిగి లోపలికి వెళ్ళింది.

"నాకెందుకు రాయలేదీసంగతి? నిన్న నీ బర్త్‌డేకి గ్రీటింగ్స్ పంపేబందులు మేమంతా వచ్చేవారంగా?"

" ?" సంతోష్ సమాధానం ఇవ్వలేదు.

"ఏది మీ అమ్మ? సకూ! సకూ!" కోపంగా పిలిచాడు

"ఎవ్వరికీ తెలీదు! సడన్‌గా జరిగింది!" కొంచెం తడబడ్డాడు.

"ఓహో! అంత వ్యవహారం జరిపావన్నమాట! ఎట్‌లీస్ట్ నాకో మెసేజ్ ఇచ్చినా, పాండిచ్చేరినించి వచ్చి, నీ తరఫున నిలబడేవాణ్ని? నీ పెళ్ళి గురించి మీ అమ్మ ఎన్ని కలలు కంటుందో నీకేం తెలుసు? ఏదో సామెత చెప్పినట్టు 'అడ్డాల నాడే బిడ్డలుగానీ, గడ్డాలనాడుకాద'న్నట్టు బాగా ప్రూవ్ చేశావు! అసలు నిన్న నేదేంవుందిలే! దాని బ్రతుకే అంత! చిన్నప్పట్నించి అడియాశలు, అవమానాల తోనే గడిచిపోయింది! అమ్మా! సకూ!" చెల్లెల్ని పిలిచాడు

"లేదు నా ముఖం చూడనంటూ వెళ్ళిపోయింది!"

"ఆఁ వెళ్ళిపోయిందా? ఎప్పుడు? నాకు తెలుసు! తన మనస్సుకు సరిపడని విషయాలని తానెప్పుడూ అంగీకరించలేదు!"

"మీ చెల్లెలు వక్కతే అలా అనుకోకండి అంకుల్! ఆమె రక్తం పంచుకొని, గర్భంలోపుట్టిన నేనుకూడా అంతే! "

"సంతోష్ ??" షాక్ తిన్న వాడిలా చివాలున కుర్చీలోంచి లేచాడు.

"ఎందుకంత ఆశ్చర్యం? ఆమె రక్తం పంచుకుపుట్టానంటేనే మీరింత ఆశ్చర్యపోతున్నారు ఆమె 'గర్భస్థ శిశువు'నని తెలిసినప్పుడు నేనెంత ఆశ్చర్యపోవాలి? నాకుమాత్రం ఆలోచన, ఆసక్తీ లేదూ? సంఘంలో నేను తలెత్తుకు తిరగద్దూ? మాంసం తిన్నంత మాత్రాన యెముకలు మెళ్ళో వేసుకున్న వారిని నేనెక్కడా చూడలేదు! యెవరో, యేమో, అన్నంత మాత్రాన, మీ చెల్లెలు ఇలా చేసి, నాకు తలవంపులు చేసింది నేను దత్తకొడుకుగా హాయిగా, ఆనందంగా పెరిగాను కానీ, ఈనాడు స్వంత కొడుకునని చెప్పి, సంఘంలో నన్ను దిగత్రొక్కి అవమానాల పాలేసింది మీ చెలి [illegible]

చూడలేని స్త్రీ, నన్ను తన స్వంత కొడుకని యెందుకు చెప్పాలి? తన పాపానికి ప్రతిరూపాన్నా నా, యిలా అవమా " సంతోష్ గుండెల్లో ఆవేశంపొంగి, కళ్ళ నుండి అశ్రువులై కురిశాయి మాటలు దొర్లిపోతున్నాయి

ఆ మాటలకు సహనం కోల్పోయాడు డాక్టర్ శ్రీకాంత్! "యూ . షటప్ " బిగ్గరగా అరిచి, అమాంతం సంతోష్ నోటిని గట్టిగా చేత్తో మూశాడు.

"ఇంకోసారి అలా అన్నావంటే నీస్నేంచేస్తానో చూడు, రాస్కెల్!" విడిచిపెట్టాడు "వక్కగానొక్క కొడుకువని గారంగా పెంచి, పెద్దచేస్తే ఇదట్రా నువ్వామెకిచ్చే రివార్డు? నీకోసం ఆమె ప్రాణాలనుకూడా లెక్కచేయలేదురా! "

"ప్రాణాలకన్నా ముఖ్యమైంది 'మానం' అంకుల్!"

"సంతోష్ !" సింహగర్జనచేశాడు. తలుపు చాటుగా వుండి వింటూన్న రూప కంపించిపోయింది

"తాతకు దగ్గులు నేర్పక్కర్లేదురా! నువ్వెంత? నీ నాలెడ్జెంత? ఈడియట్! యేవిట్రా నీ తల్లిని గురించి నీకు తెలిసింది? చెప్పు! టెల్ మీ నౌ!"

"నేను నా తల్లికి దత్తుకొడుకుని కాదు! కన్నకొడుకునిట! అయితే నాకు తండ్రిలేడు! యేం? కన్నకొడుక్కి తండ్రి యెందుకుండడు? కుంతి గర్భాన పుట్టి కర్ణుడికి కూడా సూర్యుడనే వో తండ్రి వున్నాడే! పాండురాజు పుత్రులుగా చెలా మణి అయిన పంచపాండవులకు అయిదుగురు తండ్రులున్నారే? మరి, నాకెందుకు లేడు? నే నమ్మకొడునిట? అమ్మకొడుకుని?" సంతోష్ హృదయంలో దాగిన అనుమానాన్ని వెళ్ళగక్కాడు

"ఇదేగా నీ అనుమానం? " కొద్దిక్షణాలు మౌనంగా తేరిపారజూశాడు "నువ్వు అమ్మకొడుకువేరా! యువర్ మదర్ యీజ్ సెంట్ పర్సెంట్ కరెక్ట్! కాదనే ఫూల్ యెవడన్నా వుంటే రమ్మను నా ముందుకి!" వుద్రేకంతో అరిచాడు

"మీ సవాల్ కన్నా నాకు జవాబు ముఖ్యం!" సంతోష్ రెట్టించాడు

"కీప్ క్వయట్! యువార్ ఆఫ్ట్రాల్ యే బాయ్! నేను చెప్పే సీక్వెన్స్‌కి సమాధానం చెప్పు! చూస్తా!" ఆవేశాన్ని అణచుకుంటూ అన్నాడు

"యుక్తవయస్సుకి రాకముందే పసుపు-కుంకాలు కోల్పోయిన వో స్త్రీకి వయసొచ్చాక స్త్రీ సహజమైన కోర్కెలుంటాయా, లేదా?"

" అఫ్‌కోర్స్!" సంతోష్ అన్నాడు

"ఆ కోర్కెలను పిచ్చితలంపులుగా తలిచి, తల్లి-దండ్రులు ఆమెను హింసిం చారు! మదపిచ్చన్నారు! తాళి తెగినదానికి మళ్ళీ పెళ్ళిచెయ్యకూడదన్నారు

బిడ్డల్ని కనే హక్కు లేదన్నారు! డుయు యెగ్రీ టు దిస్ సోషల్ యిన్ జస్టిస్? నువ్వొప్పుకుంటావా?”

“నో నో నెవర్!”

“నెవర్?? అపహాస్యంగా అడిగి, నవ్వాడు డాక్టర్ శ్రీకాంత్ “నీలాంటి వ్యక్తే వకడు, ఆమెను స్టేట్స్‌కి తీసుకెళ్ళాడు అక్కడ తాను మెడికల్ రిసర్చ్ చేస్తున్నాడు ‘పెళ్ళి చేసుకోరాదు’ అనే ఆంక్షవున్న యీ అమ్మాయి, కనీసం తన గర్భాన వో బిడ్డని కనాలంటుంది! భారత స్త్రీగా, శీలం చెడకుండా ‘ఈమె కోర్కెలెలా ఈడేర్చడం?’ అనే ఆలోచన అతనికి ప్రబలమైంది ఆ సమయంలో పౌల్ట్రి అండ్ 'యానిమల్ హస్‌బెన్డరీల రిసర్చి ఫలించి, సంపర్క రహితంగానే, వైద్య ప్రక్రియ ద్వారా కోళ్ళూ, పశువులు సంతానం పొందసాగాయి ‘అదే ప్రయోగాన్ని మనిషిమీద యెందుకు చెయ్యకూడదు?’ అన్న తలంపు కలిగింది తన ప్రొఫెసర్‌ని, సైకాలజిస్ట్‌ని వగైరా ముఖ్యులను సంప్రదించాడు అంతా అంగీకరించిన మీదట, ఆ అమ్మాయి అనుమతి తీసుకొని, తన ప్రొఫెసర్ ద్వారా ఆ వైద్య ప్రయోగాన్ని చేయించాడు. వారందరి కలలూ పండాయి ఆమె గర్భం ధరించింది నవమాసాలు మోసి, వో బిడ్డను కన్నది అండర్ స్టాండ్? నౌ ఐ వాంట్ యువర్ ఆన్సర్! ఆ బిడ్డకి తండ్రెవరు సంతోష్ హూ యీజ్ ది ఫాదర్ ఆఫ్ దట్ చైల్డ్? సూర్యుడా? ఇంద్రుడా? చంద్రుడా?”

అంతా విని నిరుత్తరుడైపోయాడు సంతోష్ అతని కళ్ళవెంట నీరు జల-జలా కారింది

“పార్డన్ మీ అంకుల్! నన్ను క్షమించండి!” సంతోష్ చేతులు ముఖానికి అడ్డుపెట్టుకున్నాడు కంఠంలో దుఃఖం వినిపించింది

“ఆన్సర్ మై క్వశ్చన్! చెప్పు!” గద్దించాడు

“అయామ్ సారీ అంకుల్! నే నమ్మకొడుకునే! అమ్మకొడుకుని!”

డాక్టర్ శ్రీకాంత్, సంతోష్ భుజంతట్టాడు “దటీజ్ కరెక్ట్! యువార్ రైట్! నువ్వు ‘అమ్మకొడుకు’వి సంతోష్! ఆనాటి ఆ ప్రయోగం నా ప్రొఫెసర్‌కి యెంత ఖ్యాతి నార్జించిపెట్టిందో నీకేం తెలుసు? ఆ ప్రయోగం యిలా సజీవంగా నా ముందు నిలబడి నాతో మాట్లాడుతుంటె యెంత ఆనందంగావుందో నీకేం తెలుసు?” మృదువుగా దగ్గరకు తీసుకొని, నొసట చుంబించాడు

“మీ అమ్మవద్ద నేనేమాట తీసుకున్నా సంతోష్ ఈ సంఘం కొత్తనిజాల్ని అర్థంచేసుకోలేదు! అంతెందుకు? పాతికేళ్ళనాటి ఈ ప్రయోగం, ఇంకా ప్రజలలో ప్రబలంకాలేదు చూశావా? అప్-టు-డేట్ బాయ్‌వి. నీకే డౌట్ వచ్చింది! అందువల్ల నిన్ను దత్తపుత్రుడుగా చెప్పించి, నావద్దవుంచి, ఇండియాకు వచ్చాక కూడా పల్లెటూరికి రానీకుండా పెంచాను. మరి, యీనాడు ‘అమ్మ’ యీ విషయం

బయటపెట్టిందంటే, పరిస్థితులలా వచ్చివుంటాయి! డోంట్ వర్రీ! ఈ నిజాన్ని వప్పుకుంటానికి మన సంఘానికి యింకా కొన్ని తరాలు పట్టవచ్చు!''

సంతోష్ కళ్ళు తుడుచుకున్నాడు. రిస్ట్ వాచ్ చూచాడు

''అంకుల్! మనం అర్జంటుగా స్టేషన్ కెళ్ళాలి! మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌కి ఇంకా అర్థగంటే టైముంది! వెళ్ళకపోతే అమ్మ వెళ్ళిపోతుంది!''

''ఈజిట్? నాక్కూడా యెదురవ్వలేదే? కమాన్! హరియప్!'' వడి-వడిగా బయటికి సాగాడు. సంతోష్ రూపను భద్రంగా వుండమని మేనమామ వెంట వెళ్ళాడు.

జట్కాలో యిద్దరూ బయల్దేరారు పావుగంటలో స్టేషన్ కెళ్ళారు అప్పర్ క్లాస్ లేడీస్ వైటింగ్ రూమ్‌లో కూర్చుని, యెటో చూస్తూంది శకుంతలమ్మ

''అమ్మా! .నన్ను క్షమించమ్మా! .ఈ అమ్మ కొడుకుని క్షమించమ్మా!'' వంగి కాళ్లు పట్టుకున్నాడు ఆమె చకితురాలైంది

వెనుకే అన్న శ్రీకాంత్ కూడా వచ్చాడు వెంటనే లేచి నిల్చుంది మిగతా జనం తమవైపే చూడడం చూచి, ముందుకు సాగింది

''ఏం సకూ? అలా ఆశ్చర్యపోతున్నావు? సినిమా క్లైమాక్స్‌లో వచ్చినట్లుందా నన్ను చూస్తూంటే? అయ్యిందేదో అయ్యింది వాడిని క్షమించు!'' ఆమె చేతిలోని సూట్ కేస్ లాక్కున్నాడు

''అన్నయ్యా! '' ఆమెకు దుఃఖం ఆగలేదు ''అన్నయ్యా! నువ్వన్నట్లు ''తరాలు మారినా-అంతరాలు మారలేదన్నయ్యా! నా కలలు వమ్ముచేసి, నా గుండెల్లో అగ్నిగోళాలు ప్రేల్చాడన్నయ్యా!'' అన్న భుజంమీద వాలింది

''ఊర్కోమ్మా! ఏవిటిదంతా, పిచ్చిదానిలా! నేనోటి చెబుతాను చూడు సకూ! 'ఎంతపెద్ద చదువులు చదివినా, చిన్నవాళ్లెప్పుడూ, పెద్దవాళ్ళకంటే పెద్దవాళ్ళు కాలేరు! కమాన్! రా! అన్నట్టు, కంగ్రాచులేషన్స్! నీకొడుకు బంగారుబొమ్మను నీకు కోడలుగా తెచ్చాడు!''

ఆ మాటకు శకుంతలమ్మ వదనం ప్రసన్నమై, చిరుహాసరేక వెలిసింది! ''పో అన్నయ్యా! నీకంతా వేళాకోళం!''

''సంతోష్‌బాబూ! ఎవ్విరిథింగ్ యీజ్ వొకే! మీ అమ్మ టిక్కెట్టుకాన్సిల్ చేసుకురా!''

తల్లివద్ద టిక్కెట్టు తీసుకెళ్ళి, కాన్సిల్ చేశాడు సంతోష్. ముగ్గురూ కలిసి జట్కా యెక్కారు ఎదురుగా కూర్చున్న 'అమ్మకొడుకు'ని చూచి చిన్నగా నవ్వుకున్నారు అన్నా-చెల్లెళ్ళు

* * *